సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

7వ వార్డులో పర్యటిస్తున్న మంత్రి జూపల్లికృష్ణారావు

కొల్లాపూర్,ఏప్రిల్ 2 : ప్రజా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌ను ఆదేశించారు. మంగళవారం ఉదయం మంత్రి కొల్లాపూర్ పట్టణంలోని ఏడో వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం వార్డులో మృతి చెందిన సీహెచ్ కృష్ణమూర్తి, బోయ బక్క నర్సింహ మృత దేహాలపై మంత్రి పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే ఇటీవల మృతి చెందిన గువ్వలి మణి, తిప్పరాజుల శివ, సీ హెచ్ ఈరమ్మ కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రా ముడుయాదవ్, నాయకులు వేణుగోపాల్‌యాదవ్, అన్వర్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ వారియర్స్‌కు సిమ్‌కార్డులు అందజేస్తున్న ఎస్పీ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 2: సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న టెక్నాలజీతో సైబర్‌నేరాగాళ్లు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో సైబర్ క్రైం యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు మెరుగైన సేవలందించేందుకు వారియర్లకు మొబైల్‌ఫోన్‌తో డేటా సెంటర్, నెట్‌వర్కింగ్ వ్యవస్థ, నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్, ఇన్‌ఫర్మేషన్‌తో పాటు సిమ్‌కార్డు అందించనున్నట్లు తెలిపారు. సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో 22 మంది సిబ్బందిని సైబర్ క్రైం నేరాలను పరిష్కరించేందుకు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం సైబర్ వారియర్స్‌కు ఫోన్‌తోపాటు సిమ్‌కార్డులు అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రామేశ్వర్, క్రైం డీఎస్పీ గిరికుమార్, సైబర్ వారియర్స్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఎండలకు జాగ్రత్తలు పాటించాలి

- జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి

జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి

ఊర్కొండ, ఏప్రిల్ 2 : ఏప్రిల్ మొదటి వారంలో ఎండలు తీవ్రరూపం దాల్చడంతో తగిన జాగ్రత్తలు పాటించాలని జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి అన్నారు. మండలంలోని తమసొంత గ్రామంలో మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు తీవ్రరూపం దాల్చడంతో రైతులు, విద్యార్థులు, వృద్ధులు, జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గొడుగు, దూది లాంటి తెల్లని టవల్, టోపీలు వాడాలన్నారు. అదేవిధంగా నిమ్మకాయనీళ్లు, కొబ్బరికాయ నీళ్లు, ఓఆర్ఎస్ తీసుకోవాలన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా దగ్గరలోని ప్రాథమిక దవాఖానలో తగు సూచనలు తీసుకోవాలన్నారు.

సారా, గంజాయి నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

తిమ్మాజిపేట స్టాక్ పాయింట్‌లో మద్యం నిల్వలను పరిశీలిస్తున్న డీసీ

తిమ్మాజిపేట, ఏప్రిల్ 2 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో సారా, గంజాయిని పూర్తిగా రూపుమాపేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని టీఎస్‌బీసీఎల్ స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌లో మద్యం నిల్వలు, పగిలిన మద్యం బాటిళ్లను పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తిలలో విస్తృతంగా దాడులు నిర్వహించి సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత నెల 29 నుంచి మంగళవారం వరకు సారాపై, బుధవారం నుంచి 8వ తేదీ వరకు గంజాయి, డ్రగ్స్‌పై దాడులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9 వతేదీ నుంచి 13 వరకు నాన్‌డ్యూటీ లిక్కర్, కర్ణాటక నుంచి వచ్చే మద్యంపై దాడులు నిర్వహిస్తామన్నారు. పాత నేరస్తులపై పూర్తి స్థాయిలో నిఘా పెడుతున్నామన్నారు. ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎం అబ్దుల్ ఆసిఫ్, లచ్చయ్య, ఎక్సైజ్ ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం..

బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 2 : కల్వకుర్తి పట్టణంలోని వివేకానంద కాలనీకి చెందిన కాలనీవాసులు మంగళవారం ఘనంగా వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పట్టణ సమీపంలోని మామిడితోటలో పలురకాల వంటలను అక్కడే చేసుకుని భోజనాలు చేసి సంతోషంగా గడిపారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మాధవి

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి,ఆర్డీవో మాధవి తెలిపారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సెక్టోరియల్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొదటి విడత ర్యాండమైజేషన్ పక్రియ ద్వారా అచ్చంపేట నియోజకవర్గంలో 44మంది సెక్టోరియల్ రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో తాసీల్దార్ మురళీ మోహన్, డీఏవో తబితా, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

30లోపు ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 2 : ఈనెల 30 లోపు 2024-25కు ఆస్తిపన్ను చెల్లించి 5శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆస్తిపన్నుతో పాటు నల్లాబిల్లులు, ట్రేడ్‌లైసెన్సు ఫీజులు, అడ్వర్టైజ్‌మెంట్ ఫీజులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు.

ఓటుతో సమాజం చైతన్యం

- కలెక్టర్ ఉదయ్‌కుమార్
- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి 5కేరన్ ప్రారంభం

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 2: ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుపై అవగాహన ఉండాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా నైతిక ఓటింగ్‌పై మంగళవారం నిర్వహించిన 5కే రన్‌ను కలెక్టర్ ఎ స్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్ కు మార్ దీపక్‌తో కలిసి నాగర్‌కర్నూల్ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జెండా ఊపి ప్రారంభించారు. 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో నిర్వహించిన 5కె రన్ ట్యాంక్‌బండ్ వరకు ఉత్సాహంగా సాగింది. రన్‌లో వివిధ శాఖల అధికారులతో పాటు డ్వాక్రా సంఘాల సభ్యులు, కళాకారులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంతకుముందు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదేనని, కుల, మత, లింగబేదం లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించిందన్నారు. ఎన్నికల సంఘం 85 ఏండ్లు నిం డిన వారికి, దివ్యాంగ ఓటర్లకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించిందని తెలిపారు. హోం ఓటింగ్ వే యాలనుకునే ఓటర్లు ఫాం-12 డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, లేదా సక్ష్యం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి చిన్న ఓబులేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌసెల్ కిశోర్‌పాండే, వివిధ శాఖల అధికారులు, కళాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బృందంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

జిల్లాలో 200 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 2 : జిల్లాలో మొత్తం 200 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యాసంగి సీజన్ 2023-24 ఏడాదికి సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ డీఆర్డీవో ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోళు కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు వరిధాన్యం కొనుగోలు, ఆన్‌లైన్‌లో నమెదు చేసే విధానాలు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజన్‌టేషన్ ద్వారా ఏపీఎం, డీపీఎం, ఐకేపీ, మెప్మా సభ్యులకు వివరించారు. వరి ధాన్యం గ్రేడ్ ఏ రకం ధర రూ.2,203, సాధారణ రకం రూ.2,183లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువకు వరి ధాన్యాన్ని అమ్మవద్దని సూచించారు. ధాన్యాన్ని తేమ శాతం 17కన్నా తక్కువ లేకుండా, నాణ్యతగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. వరి జాగ్రత్తగా ఏరోజుకారోజు వివరాలను నమోదు చేసి రైతులకు, మిల్లర్లకు ఎలాంటినష్టం కాకుం డాచర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులను మోసంచేస్తే ఎఫ్ఐఆర్ నమోదుచేసి ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ సీతారామారావు, డీఎస్‌వో స్వామికుమార్, ఏపీడీ లక్ష్మీనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ బాలరాజు, డీఏవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు
- జోగులాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, బళ్లారి రేంజ్ ఐజీపీ లోకేశ్‌కుమార్

మాట్లాడుతున్న జోగులాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, బళ్లారి రేంజ్ ఐజీపీ లోకేశ్‌కుమార్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 2 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక సరిహద్దు పోలీసు అధికారులు సమిష్టి కృషితో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, బళ్లారి ఐజీపీ లోకేశ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జోన్-7 జోగులాంబ డీఐజీ కార్యాలయంలో అంతరాష్ట్ర సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మద్యం, నగదు అక్రమ రవాణా నియంత్రణపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. నిషేధిత మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. హైవే పెట్రోలింగ్‌తోపాటు మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీసు అధికారులు వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. సమస్మాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్, గద్వాల ఎస్పీ రితిరాజ్, నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్, రాయచూరు ఎస్పీ నిఖిల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

- అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్

అమ్రాబాద్, ఏప్రిల్ 2: తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని బీకే తిర్మలాపూర్, బీకే ఉప్పుపుంతల, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తాగునీటి సమస్య గురించి అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పైపులైన్ సమస్యలుంటే వెంటనే సరిచేస్తూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం నర్సరీలు, గ్రామాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌లాల్, ప్రత్యేకాధికారులు, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

జంగంరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్

బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్

నాగర్‌కర్నూల్‌లో పాపన్నగౌడ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

వెల్దండ ఏప్రిల్ 2 : బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించేందుకు యువత నడుం బిగించాలని గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బహుజన పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొల్లాపూర్‌లో

కొల్లాపూర్, ఏప్రిల్ 2: పట్టణంలో బహుజన ఐక్య వేదిక, గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకులు వెంకటస్వామిగౌడ్, సుదర్శన్‌గౌడ్, తాలూకా అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామిగౌడ్, గోవింద్‌గౌడ్, ఎల్లాగౌడ్ , సామాజిక రచయితల సంఘం జిల్లా కన్వీనర్ మాచర్ల మధుసూదన్‌గౌడ్, బీసీ సంఘం నాయకులు చంద్రయ్య యాదవ్, ఆది వసంతకుమార్, రాముమాదిగ, తిరుపతినాయక్, ధర్మయ్య, మాజీ సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండలో...

పెంట్లవెల్లి మండలంలో..

పెంట్లవెల్లి, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలో గౌడ సంఘం మహిళా జిల్లా ప్రచార కార్యదర్శి శశికళాభాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

బిజినేపల్లిలో మండలంలో

బిజినేపల్లి, ఏప్రిల్ 2: బహుజన ఆత్మగౌరవానికి, వీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం జిల్లా కార్యదర్శి రమణగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్‌కు ఘన నివాళి..

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ :2 : జిల్లా కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు ప్రగతి గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనా భాస్కర్‌గౌడ్, నాయకులు సుదర్శన్, వెంకటస్వామి, శంకర్, మాధవి, చంద్రకళ పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

పెంట్లవెల్లిలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం మహిళా సభ్యులు

బిజినేపల్లిలో పాపన్నగౌడ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

5న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాక

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 2: బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఈ నెల 5వ తేదీన అచ్చంపేటకు వస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా.గువ్వల బాలరాజు తెలిపారు. మంగళవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగాల రోడ్డులో గల బీకే ప్యాలెస్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. ఈ సమావేశానికి అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కిశోర్

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 2 : నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్టీమండల యూత్ అధ్యక్షుడు కిశోర్ మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా ఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన పేర్కొన్నాడు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమావేశంలో మాట్లాడుతన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, ఏప్రిల్ 2 : రెండో అపర భద్రాదిగా పేరుగాంచిన సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుండి 22 వరకు జరిగే ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. మంగళవారం సీతారామచంద్రస్వామి ఆలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఈవో రఘు, తాసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 2 : ఫేక్ కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి కొందరు అపరిచిత వ్యక్తులు ప్రజల నుంచి డబ్బులు కట్టించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి సదరం శిబిరం

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో గురువారం నుంచి సదరంశిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి చిన్నఓబులేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు నూతన, రెన్యూవల్ సదరం సర్టిఫికెట్ల కోసం బుధవారం నుంచి మీసేవా కేంద్రాల్లో రూ.35 చెల్లించి స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు. బుకింగ్‌లో కేటాయించిన తేదీ ఆధారంగా జిల్లా జనరల్ దవాఖానలో నిర్వహించే సదరం శిబిరానికి హాజరు కావాలన్నారు. శారీరక దివ్యాంగులకు 4, 15, 22 తేదీల్లో, వినికిడిలోపం ఉన్న వారికి 19, 26, కంటిచూపు లోపం ఉన్న వారికి 4, 22వ తేదీన వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

కొల్లాపూర్, ఏప్రిల్ 2: మండలంలోని చింతలపల్లిలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు భా రతి, సుగుణను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 2 : భార్యభర్తల గొడవతో క్షణికావేశంలో పురుగుల మందుతాగి మనస్విసాగర్‌చౌహాన్(22) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్సై మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన సాగర్ చౌహాన్ దంపతులు మండలంలోని జంగారెడ్డిపల్లిలో రమేశ్‌తో పశువులషెడ్డులో పనిచేసేందుకు వచ్చారు. మూడు రోజుల క్రిందట సాగర్‌చౌహాన్ దంపతుల మధ్య గొడవ కావడంతో క్షణికావేశంలో పురుగులమందు తాగి మృతి చెందినట్లు మృతురాలి తల్లి తెలిపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై మంగళవారం పేర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడి..కేసు నమోదు

బల్మూరు, ఏప్రిల్2: మండలంలోని ఓగ్రామానికి చెందిన బాలికపై ఆదేగ్రామానికి చెందిన అటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. ఎస్సై కథనం మేరకు గత నెల24న గ్రామానికి చెందిన బాలికను ఆటో డ్రైవర్ బలవంతంగా పాడుబడ్డ ఓ ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నిస్తుండగా చుట్టు పక్కల వారు గమనించిడంతో బాలికను వదిలి పారిపోయాడు. అప్పటి నుంచి బాలిక బాధపడుతుండగా గమనించిన బాలిక నాయనమ్మ విషయం తెలుసుకొని మంగళవారం బంధువులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. కాగా ఏడాది క్రితం కూడా బాలికపై నిందితుడు లైంగిక దాడికి పాల్పడ్డట్లు తెలిపారు. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 2 : కల్వకుర్తి సమీపంలో జేపీనగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి జేపీనగర్ అండర్‌పాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకుని ప్రమాదానికి కారణాలు ప